సాక్షి అన్నమయ్య జిల్లా

ఆదివారం । 27 । ఆగస్టు । 2023



రాపూరు రోడ్డు ప్రమాదంలో మరో ఇద్దరు మృతి

రాపూరు ఘాట్ రోడ్డులో శుక్రవారం రాత్రి కొండను ఐచర్ వాహనం ఢీకొన్న సంఘటనలో మరో ఇద్దరు మృతి చెందారు. -8లో..



ఉద్యోగం సాధించేలా శిక్షణ

డిగ్రీ విద్య అయిపోయిన వెంటనే ఉద్యోగం, ఉపాధి లభించేలా కోర్సులను తీర్చిదిద్దినట్లు ఏపీ కళాశాల విద్య కమిషనర్ డాక్టర్ పోలా భాస్కర్ పేర్కొన్నారు. -8లో..

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్ఠం	గరిష్ఠం
మొదటిరకం	రూ.220	రూ.280
రెండోరకం	రూ.140	రూ.210

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 257 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్ఠం	గరిష్ఠం
బైవోల్టిన్	480	600
సీబీ	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 399.840 కిలోలు



న్యూస్‌రీల్

సత్యాగ్నికి 'కవిత' పురస్కారం



కడప కల్చరల్: సాహిత్య వేత్త షేక్ హుస్సేన్ సత్యాగ్నికి ఆచార్య కేతవిశ్వనాథ రెడ్డి స్మారకంగా జీవిత సాఫల్య పురస్కారాన్ని అందజేయనున్నామని కవిత విద్య సాంస్కృతిక సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు అలపర్తి పిచ్చయ్య చౌదరి శనివారం తెలిపారు. అక్టోబర్లో జరగనున్న ప్రత్యేక సభలో పదివేల రూపాయలతో పాటు జ్ఞాపిక సన్మాన పత్రం కూడా అందజేస్తామన్నారు. వివిధ రంగాలలో విశేష సేవలు అందించినవారికి కూడా పురస్కారాలు అందజేస్తామన్నారు.

షరీఫ్‌కు గిడుగు పురస్కారం



వేంపల్లె: కథారచయిత, కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కార గ్రహీత డాక్టర్ వేంపల్లి షరీఫ్‌కు రాష్ట్ర అధికార భాషా సంఘం, తెలుగు భాషాభివృద్ధి ప్రాధికార సంస్థ తరపున గిడుగు వెంకట రామ్మూర్తి పంతులు భాషా పురస్కారం ప్రకటించారు. ఈమేరకు అధికార భాషా సంఘం అధ్యక్షుడు విజయ్ బాబు శనివారం లేఖ పంపారు. ఈ నెల 29న విజయవాడలో షరీఫ్‌కి పురస్కారం ప్రదానం చేయనున్నారు.

28న పీఈటీ, పీడీ2లకు సమావేశాలు

రాయచోటి: అన్నమయ్య జిల్లా పరిధిలోని పీఈటీ, పీడీలకు ఈ నెల 28న స్పోర్ట్స్ కాంప్లెక్స్ సమావేశాలను నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి శ్రీరామ్‌పురుషోత్తం తెలిపారు. పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఈ ఏడాది నుంచి సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించినట్లు శనివారం ఒకప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 28న ఉదయం 8.45 గంటల నుండి సాయంత్రం 5.30 గంటల వరకు సూచించిన కేంద్రాల్లో నియోజకవర్గాల వారీగా నిర్వహించాలని డీఈఓ తెలిపారు. శిక్షణలో పీఈటీ, పీడీలు అందరూ క్రీడా దుస్తులు ధరించి రావాలని డీఈఓ తెలియజేశారు.

పీలేరు నియోజకవర్గం: కోటపల్లె బాలుర ఉన్నత పాఠశాల, పీలేరు
మదనపల్లె నియోజకవర్గం : జెడ్పీ ఉన్నత పాఠశాల, మదనపల్లె
తంబళ్లపల్లి నియోజకవర్గం: జెడ్పీ ఉన్నత పాఠశాల, అంగళ్లు
రాయచోటి నియోజకవర్గం: ప్రభుత్వ ఉన్నత పాఠశాల, నేతాజీ సర్కిల్, రాయచోటి
రాజంపేట నియోజకవర్గం: ప్రభుత్వ ఉన్నత పాఠశాల, రాజంపేట
రైల్వేకోడూరు నియోజకవర్గం: హెచ్‌ఎంఎం ఉన్నత పాఠశాల, రైల్వేకోడూరు

పంటల సాగులో సూచనలు అందించాలి



మాట్లాడుతున్న శాస్త్రవేత్త శ్రీనివాస్ ఆచారి

కడప అగ్రికల్చర్: పంటల సాగులో రైతులకు ఏడీఏలు అండగా ఉంటూ తగిన సలహాలు, సూచనలను ఇవ్వాలని ఊటుకూరు వ్యవసాయ పరిశోధన కేంద్ర ప్రధాన శాస్త్రవేత్త శ్రీనివాస్ ఆచారి అన్నారు. శనివారం కడప నగర శివార్లలోని ఊటుకూరు పరిశోధన కేంద్రంలో ఉమ్మడి జిల్లా లోని ఏడీఏలకు శిక్షణ తోపాటు వర్షభావ పరిస్థితులపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని వివిధ మండలాల్లో సాగు చేసిన పంటల ప్రస్తుత పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. రెండు జిల్లాల్లో కూడా సరైన వర్షంపాతం లేకపోవడంతో పంటలసాగు విస్తీర్ణం తగ్గిందని అన్నారు. సాగు చేసిన పంటలు కూడా వర్షాభావం వల్ల ఎండిపోతున్నట్లు తెలిపారు. దీనిపై రైతులకు తగిన సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు. సెప్టెంబర్‌లోపు వర్షాలు పడితే సాగు చేయాల్సిన ప్రత్యామ్నాయ పంటలపై ఆయనతోపాటు వ్యవసాయ శాస్త్రవేత్తలు వివరించారు. ఈ కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా వ్యవసాయ అధికారి చంద్రనాయక్, ఆత్మ పీడీ విజయలక్ష్మి, ఏరువాక కేంద్ర సమన్వయకర్త మురళీకృష్ణ, వ్యవసాయ శాస్త్రవేత్తలు సునిల్‌కుమార్, శ్రీవల్లి, శిల్పకళ, బాగమతిప్రియ, జాన్సన్ తదితరులు పాల్గొన్నారు.

చక్రధారికే కాదు.. చక్రానికి ఆలయం!

- అన్నమయ్య జన్మస్థలిలో ఆలయం
- ఏకశిలపై సుదర్శన చక్రం



నారాయణుడి చేతిలో ఉన్న సుదర్శనచక్రం



తాళ్లపాకలోని సుదర్శనచక్రాలయం (ఇన్‌సెట్) పూజలందుకుంటున్న సుదర్శన చక్రం



SAKSHI SPECIAL

రాజంపేట: విష్ణుమూర్తి స్వరూపుడైన నారాయణుడికి దేశంలో వేలకొద్దీ ఆలయాలు ఉన్నా.. ఆయన సుదర్శన చక్రాన్ని ఆలయంలో ప్రతిష్ఠించి పూజించడం అరుదు. తొలి తెలుగు వాగ్గేయకారుడు అన్నమయ్య జన్మస్థలిలో భక్తుల ఆరాధ్య దైవంగా చక్రధారిని కొలుస్తూనే.. ఆయన సుదర్శన చక్రానికి ఆలయం కట్టారు గ్రామస్థులు. స్వామిని పూజిస్తే కోరిన కోర్కెలు తీరుస్తాయనడి భక్తుల నమ్మకం.

కాశీ తర్వాత తాళ్లపాకలోనే..

పద కవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యుల జన్మస్థలం తాళ్లపాకకు ప్రత్యేకత ఉంది. ఇక్కడ చెన్నకేశవస్వామి ఆలయంతోపాటు ఏకశిలపై సుదర్శన చక్రం ఉన్న ఆలయం ఉండడమే ప్రత్యేకత. నల్ల రాతి పైభాగంలో విష్ణుమూర్తి సుదర్శన చక్రం, దిగువన సంతాన గోపాలుడు పూజలందుకుంటున్నారు. భక్తులు సుదర్శనచక్ర తాళ్వార్‌ను దర్శించుకున్న తర్వాత వెనుక చెన్నకేశవస్వామి దర్శనం చేసుకుంటారని ప్రతీతి. ఈ ఆలయం కాశీలో ఉందని, అనంతరం ఆ కోవలోకి అన్నమాచార్య జన్మస్థలి తాళ్లపాక చేరిందని భక్తులు చెబుతారు.

పెద్ద తిరుమాలచార్యుడు ప్రతిష్ఠించారని..

పద కవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యులు కుమారుడు పెద్దతిరుమలా చార్యుడు సుదర్శనచక్రం ప్రతిష్ఠించారని పరిశోధకులు చెబుతున్నారు. తాళ్లపాకలోని చెన్నకేశవస్వామిని అన్నమయ్య నిత్యం ఆరాధించేవారని చెబుతారు. శిథిలమైన గుడిని టీటీడీ అభివృద్ధి చేసింది.

తాళ్లపాకలో సుదర్శనచక్రాలయం



కాశీలోనూ, తాళ్లపాకలోనే సుదర్శన చక్రాలయం ఉందని చెబతారు. దిగువన సంతాన వేణుగోపాలుడు కనిపిస్తాడు. స్వామికి అభిషేకం చేస్తే సంతానయోగం కలుగుతుందని భక్తుల నమ్మకం. పెద్దతిరుమలాచార్యుడు ప్రతిష్ఠించారని పూర్వీకుల సమాచారం.
– రామాయణం నరేష్, అర్చకుడు, తాళ్లపాక

దేశంలోనే అరుదైన ఘనత



తాళ్లపాకలో చెన్నకేశవస్వామి ఆలయ ప్రాంగణంలోనే సుదర్శనచక్రం ఆలయం ఉంది. దేవుళ్లకు ఆలయాలు ఉంటాయి. దేవుని ఆయుధానికి ఒక్క తాళ్లపాకలోనే ఆలయం ఉందని చెప్పవచ్చు. అన్నమయ్య జన్మస్థలి తాళ్లపాకపై టీటీడీ విస్తృత ప్రచారం చేయాలి.
– చొప్పా ఎల్లారెడ్డి, వైస్ ఛైర్మన్, ఏఐటీఎస్, తాళ్లపాక

కడపకు సమున్నత గౌరవం!

టీటీడీ పాలకమండలిలో జిల్లా వాసులు ఇద్దరికి చోటు



మాసీమబాబు



యానాదయ్య

సాక్షి ప్రతినిధి, కడప: తిరుమల–తిరుపతి దేవస్థానం పాలకమండలి బోర్డు కూర్పులో వైఎస్సార్ జిల్లాకు సమున్నత గౌరవం దక్కింది. జిల్లావాసులు ఇద్దరికి సభ్యులుగా అవకాశం కల్పించారు. రాష్ట్రంలోని 26 జిల్లాలతోపాటు, పొరుగు రాష్ట్రాల్లో పెద్ద ఎత్తున ఆశావహులు ఉన్నప్పటికీ 24 మంది సభ్యులతో చేపట్టిన కూర్పులో ఇద్దరికి అవకాశం లభించింది. దేశానికి రాజు అయినా తల్లికి బిడ్డే అన్నట్లుగా రాజకీయంగా ఆదరించి అక్కున చేర్చుకున్న కన్నతల్లి లాంటి వైఎస్సార్ జిల్లాకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సముచిత స్థానం కల్పించడంపై సర్వత్రా హర్షం వ్యక్తమౌతోంది.

- టీడీపీ పాలకమండలి బోర్డు సభ్యులుగా వైఎస్సార్ జిల్లాకు చెందిన మాసీమ బాబు (రాచుపల్లె వెంకటసుబ్బారెడ్డి), సిద్దవటం యానాదయ్యలకు అవకాశం లభించింది. కడప గడపలో ప్రజానీకానికి సుపరిచితుడైన మాసీమ బాబుకు గత పాలకమండలిలోనే ప్రత్యేక ఆహ్వానితుడిగా రాష్ట్ర ప్రభుత్వం అవకాశం కల్పించినా హైకోర్టు ఉత్తర్వుల కారణంగా ఆ నియామకం రద్దయింది. దేవదేవుని సేవలో పాలుపంచుకునే అవకాశం చేజారడం ఒకింత నిరాశే కల్గించినా, నూతన పాలకమండలి కూర్పులో మాసీమ బాబుకు ముఖ్యమంత్రి పట్టం కట్టారు. గతంలో జిల్లాలో వరుసగా రెండు పర్యాయాలు టీటీడీ బోర్డు సభ్యులుగా ప్రొద్దుటూరు నియోజకవర్గానికి ప్రాధాన్యత ఇచ్చారు. ఈమారు కడప, కమలాపురం నియోజకవర్గాలకు చెందిన నేతలకు అవకాశం లభించింది.

యానాదయ్యను వరించిన అదృష్టం....

నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్‌గా కొనసాగుతున్న సిద్దవటం యానాదయ్యకు టీటీడీ బోర్డు మెంబరుగా అదృష్టం వరించింది. రాష్ట్రంలో సామాజిక సమీకరణ కూర్పులో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆది నుంచి బీసీలకు సముచిత స్థానాన్ని కల్పిస్తున్నారు. అందులో భాగంగా టీటీడీ మెంబర్‌గా బీసీల్లో నాయీబ్రాహ్మణులకు అవకాశం కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈక్రమంలో పలువురి పేర్లు పరిశీలనలోకి లభించినా ఆయా ప్రాంతాల సమీకరణల నేపథ్యంలో నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్‌గా కొనసాగుతోన్న సిద్దవటం యానాదయ్య పేరు తెరపైకి వచ్చింది. గతంలో తిరుమల కొండపైన నాయీబ్రాహ్మణుల సమస్యలపై టీడీపీ ప్రభుత్వంతో ప్రత్యక్ష పోరాటం నెరిపిన అనుభవం యానాదయ్యకు ఉంది. సామాన్యులకు సముచిత స్థానం కల్పించడంలో దేశంలోనే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆదర్శంగా నిలుస్తోందని రాజకీయ విశ్లేషకులు చెబుతోండడం విశేషం.

ర్యాగింగ్ రహిత క్యాంపస్‌గా ఏఎఫ్‌యూ

వైవీయూ : ర్యాగింగ్ రహిత క్యాంపస్‌గా డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయం ఆదర్శంగా నిలవాలని వైఎస్ఆర్ ఏఎఫ్‌యూ వైస్ చాన్సలర్ ఆచార్య బి. ఆంజనేయప్రసాద్ ఆకాంక్షించారు. శనివారం విశ్వవిద్యాలయంలో యాంటీ ర్యాగింగ్ పోస్టర్లను రిజిస్ట్రార్ ఆచార్య ఇ.సి. సురేంద్రనాథ్‌రెడ్డితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ సీనియర్లు, జూనియర్లు అన్న తేడా లేకుండా విద్యార్థులందరూ స్నేహపూర్వకంగా మెలగాలన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య ఇ.సి. సురేంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ర్యాగింగ్ సంస్కృతికి దూరంగా ఉంటూ చక్కగా చదువుకోవాలని సూచించారు. అనంతరం యాంటీ ర్యాగింగ్ పోస్టర్ డిజైన్, లోగో డిజైన్, వ్యాసరచన పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ రిజిస్ట్రార్ రాజేష్‌కుమార్‌రెడ్డి, యాంటీ ర్యాగింగ్ కమిటీ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అయ్యవార్లకు అవార్డుల పండుగ

ఉపాధ్యాయ పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం



బోధన చేస్తున్న ఉపాధ్యాయుడు

మదనపల్లె సిటీ: ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కరించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. సెప్టెంబరు 5న (ఉపాధ్యాయ దినోత్సవం) పురస్కారాలు అందించాలని సంకల్పించింది. ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు అర్హులైన వారు ఈ నెల 30వ తేదీ లోగా తమ దరఖాస్తులను పంపాలని ఇప్పటికే ఆదేశాలిచ్చింది. ప్రభుత్వ పాఠశాలలతోపాటు ఆదర్శ, కేజీబీవీ పాఠశాల ఉపాధ్యాయులకు ఈ ఏడాది పురస్కారాలు జిల్లా, రాష్ట్ర స్థాయిలో అందివ్వనున్నారు. జిల్లా స్థాయిలో కలెక్టర్ ఛైర్మన్‌గా, డీఈఓ కన్వీనర్‌గా, మరింత మంది అధికారులతో కూడిన కమిటీ ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేయనుంది.

ఎంపికకు ఇవన్నీ ఉండాల్సిందే

- జిల్లా, రాష్ట్ర స్థాయి పురస్కారాలు పదేళ్ల బోధన అనుభవం ఉండాలి.
- ఈ విద్యా సంవత్సరంలో ఉద్యోగ విరమణ చేసిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు.
- క్రమశిక్షణా చర్యలు, క్రిమినల్ కేసులు ఉండరాదు.

పారదర్శంగా ఎంపిక



జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు దరఖాస్తులు ఆహ్వానించాం. ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారానికి ప్రతిపాదన చేసే వారికి సంబంధించి పది లైన్లకు మించకుండా పరిశీలనాధికారి రాస్తారు. వచ్చిన దరఖాస్తులను చూసి పారదర్శంగా అర్హులను ఎంపిక చేస్తాం. తొమ్మిది కేటగిరీల్లో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నాం. – శ్రీరాం పురుషోత్తం, డిఈఓ

లోక్ అదాలత్‌తో సత్వర న్యాయం



మాట్లాడుతున్న పర్మనెంట్ లోక్ అదాలత్ ఛైర్మన్ స్వర్ణ ప్రసాద్

కడప అర్బన్: పర్మనెంట్ లోక్ అదాలత్ (పీఎల్.ఏ) ద్వారా ఫిర్యాదు దారులు ఎలాంటి కోర్టు ఖర్చులు లేకుండా సత్వర న్యాయం పొందొచ్చని ఇన్‌చార్జి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికారసంస్థ ఛైర్మన్ జి. గీత పేర్కొన్నారు. శనివారం స్థానిక జిల్లా కోర్టు ప్రాంగణంలోని న్యాయసేవా సదన్ భవనంలో 'శాశ్వత లోక్ అదాలత్' ఆధ్వర్యంలో ప్రాయోజిత సేవా రంగాల్లో న్యాయసేవలపై ప్రభుత్వశాఖల అధికారులకు అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఇన్‌చార్జి జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. గీత మాట్లాడుతూ 'పర్మినెంట్ లోక్ అదాలత్' అనే వ్యవస్థ ఇద్దరు వ్యక్తుల మధ్య వివాదం (ఏ ఇతర కోర్టులో పెండింగ్ లేని) కలిగి ఉన్న వారందరికీ ఎలాంటి కోర్టు ఖర్చులు లేకుండా సత్వర న్యాయ పరిష్కారం అందించే ఉద్దేశంతో ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పర్మనెంట్ లోక్ అదాలత్ అందించే తీర్పు ... భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఇచ్చే తీర్పుతో సమానమన్నారు. పర్మినెంట్ లోక్ అదాలత్ చైర్మన్ స్వర్ణ ప్రసాద్ మాట్లాడుతూ ఈ తీర్పునకు ఎలాంటి అప్పీలు లేదని, దీని ద్వారా 10 రకాలైన ప్రజా ప్రయోజిత సేవా రంగాలకు సంబంధించిన సేవల్లో లోపం, పరిహారం కోసం దావా, సొమ్ము వసూలు, పర్మినెంట్ లోక్ అదాలత్ నినాదమన్నారు.

భవన నిర్మాణాలు పూర్తి చేయాలి

జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్



బ్యాంకర్ల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్

రాయచోటి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న ప్రభుత్వ ప్రాధాన్యత భవన నిర్మాణాలను సెప్టెంబర్ 15వ తేదీలోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో పంచాయతీరాజ్ శాఖ ఈఈలు, డీఈలు, ఏఈలతో గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ సీపీ హెల్త్ క్లీనిక్ భవన నిర్మాణాల పురోగతిపై జిల్లా కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వ ప్రాధాన్యత భవన నిర్మాణాలపై అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని కలెక్టర్ అన్నారు. అధికారులు అందరూ ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని గ్రామ సచివాలయాలు, వైఎస్సార్ హెల్త్ క్లీనిక్‌లు, రైతు భరోసా కేంద్రాల నిర్మాణంలో నిర్లక్ష్యం చూపకుండా అత్యంత ప్రమాణాలతో రూపు దిద్దుకునేటట్లు చూడాలన్నారు. జిల్లాలో గ్రామ సచివాలయాలు 366కుగాను 227 పూర్తి చేయడం జరిగిందని, ఇంకా 139 భవనాలు పూర్తి చేయాల్సి ఉందన్నారు. రైతు భరోసా కేంద్రాలు 319కిగాను 179 పూర్తి చేసినట్లు చెప్పారు. వైఎస్సార్ హెల్త్ క్లీనిక్‌లు 212కుగాను 97 భవనాలు పూర్తి చేశామన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఎస్ఈ దయాకర్ రెడ్డి, మదనపల్లె ఈఈ చంద్రశేఖర్ రెడ్డి, రాజంపేట ఈఈ రామచంద్ర, పంచాయతీరాజ్ డీఈలు, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా అభివృద్ధిలో బ్యాంకర్లు భాగస్వామ్యం కావాలి

జిల్లాలో బ్యాంకుల వారీగా ఇచ్చిన లక్ష్యాన్ని అధిగమించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ బ్యాంక్ మేనేజర్లకు సూచించారు. శనివారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన బ్యాంకర్లతో డిస్ట్రిక్ట్ కన్సల్టెటివ్ కమిటీ (డీసీసీ), డిస్ట్రిక్ట్ లెవల్ రివ్యూ కమిటీ (డీఎల్ఆర్‌సీ) సమావేశాన్ని నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమంకోసం అనేక పథకాలను అమలు చేస్తోందని, అందుకు సంబంధించి అర్హత పొందిన లబ్ధిదారులకు వెంటనే రుణాలు మంజూరు చేయాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల వారిని ఆర్థికంగా నిలబెట్టేందుకు ప్రవేశపెట్టిన పీఎంఈజీపీ, పీఎంఏవై, స్టాండప్ ఇండియా, జగనన్నతోడు పథకాలకు సంబంధించి అర్హత ఉన్న యువ పారిశ్రామిక వేత్తలు, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు లబ్ధి చేకూర్చేలా అవకాశం కల్పించాలన్నారు.అన్నమయ్య జిల్లాలో 50శాతం మంది పాడిపరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్నారని, వీరికి పీఎంఈజీపీ పథకంలో భాగంగా బ్యాంకులు పాడి పరిశ్రమకు రుణాలు ఇవ్వాలన్నారు. ఈ సందర్భంగా 2023–24 జిల్లా క్రెడిట్ ప్లాన్ పుస్తకాన్ని జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ వెంకటేశ్వర్‌రెడ్డి, పరిశ్రమలశాఖ జిల్లా మేనేజర్ నాగరాజు, డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ, వివిధ బ్యాంకుల మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ

కడప కార్పొరేషన్: ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామ పంచాయితీ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా పరిషత్ సీఈఓ సుధాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఉన్న 528 మంది గ్రేడ్ 1 నుంచి 5 వరకూ గల పంచాయితీ కార్యదర్శులకు జిల్లా పంచాయితీ వనరుల కేంద్రం(డీపీఆర్‌సీ)లో ఆరు రోజుల వసతితో కూడిన శిక్షణా కార్యక్రమం నిర్వహించనున్నామన్నారు. ఈ నెల 29వ తేదీ నుంచి సెప్టెంబర్ 30వ తేదీ వరకూ 5 బ్యాచ్‌ల వారీగా శిక్షణ ఉంటుందన్నారు. లేఅవుట్ల ఏర్పాటు, జగనన్న శాశ్విత భూ హక్కు అమలుపై ఒకరోజు ఫీల్డు విజిట్ ఉంటుందని, ఏపీ పంచాయితీ రాజ్ చట్టం, ఉద్యోగుల విధి నిర్వహణ– క్రమశిక్షణ చర్యలు, ఉపాధి హామీ పథకం తదితర అంశాలపై శిక్షణ ఉంటుందన్నారు.

క్లుప్తంగా

యువకుడి ఆత్మహత్య


అశోక్ (ఫైల్)

కలకడ : మండల పరిధి బాలయ్యగారిపల్లె పంచాయతీలోని తూర్పువడ్డిపల్లెలో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన చోటుచేసుకుంది. హెడ్‌కానిస్టేబుల్ రమేష్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. తూర్పువడ్డిపల్లెకు చెందిన సురేంద్ర కుమారుడు అశోక్ (24) చెడు అలవాట్లకు బానిసై సారా తాగడం, పేకాట ఆడటం వంటి వాటికి బానిస అయ్యాడు. ఈ నేపథ్యంలో తండ్రి శుక్రవారం మందలించాడు. దీంతో బాలయ్యగారిపల్లె దారిలో అశోక్ పురుగుల నివారణ మందు తాగిపడి ఉండటం గ్రామస్తులు గుర్తించి తండ్రికి సమాచారం అందించారు. వెంటనే తిరుపతిలోని ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం మత్తులో యువకుల వీరంగం


టెలిఫోన్ స్తంభాన్ని ఢీకొన్న కారు

నందలూరు (రాజంపేట) : నందలూరు మండలం నాగిరెడ్డిపల్లి అర్బన్ పరిధిలోని అరవపల్లెలో శనివారం మద్యం మత్తులో యువకులు వీరంగం సృష్టించారు. అతి వేగంగా కారు నడిపి హల్‌చల్ చేయగా.. పాదాచారులు భయభ్రాంతులకు గురయ్యారు. ఈ సంఘటన ముత్తుమారమ్మ ఆలయ సమీపంలో చోటుచేసుకుంది. భూమన మల్లారెడ్డి భవన్ సమీపంలో ఉన్న టెలిఫోన్ స్తంభాన్ని కారు ఢీకొంది. వెంటనే కారులోని ఐదుగురు యువకులు పరారీ అయ్యారు. అదృష్టవశాత్తు ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు.

చంద్రబాబు, లోకేష్‌పై ఫిర్యాదు


నందలూరులో ఏఎస్‌ఐకు ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా ప్రతినిధులు

నందలూరు(రాజంపేట) : టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు, ఆయన తనయుడు నారాలోకేష్, ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడుపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా సోషల్ మీడియా కన్వీనరు భాస్కర్‌యాదవ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు రాజంపేట నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కన్వీనరు సయ్యద్ అబ్దుల్ హుసేన్ (ఇబ్బు), చాపల మధుకుమార్, మండల కో–ఆప్షన్ సభ్యుడు కలీంతో కలిసి స్థానిక ఏఎస్‌ఐ శంకర్‌నాయక్‌కు ఫిర్యాదు పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆ ముగ్గురు టీడీపీ నేతలు రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా.. రెచ్చగొట్టే ధోరణిలో ప్రసంగాలు చేస్తున్నారని పేర్కొన్నారు. నారా లోకేష్ రెండు రోజుల క్రితం, అంతకు ముందు కూడా యువగళంలో 2019 నుంచి 2024 వరకు ఏ కార్యకర్త మీద ఎక్కువ కేసులు ఉంటాయో వారికే నామినేటెడ్ పదవులు ఇస్తామని పేర్కొనడం దేనికి సంకేతం అన్నారు. రాష్ట్రంలో అల్లర్లు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని చెప్పారు. అందులో భాగంగా తంబళ్లపల్లె, పుంగనూరు, మాచర్ల వంటి సున్నితమైన నియోజకవర్గాలలో గొడవలు చేస్తున్నారన్నారు. రానున్న రోజుల్లో ఇది ఇంకా ఎక్కువగా జరిగే ప్రమాదం ఉందన్నారు. కాబట్టి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

కలికిరి : శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్న టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు, నాయకుడు నారా లోకేష్, రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పీలేరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కో–కన్వీనర్ జి.యుగంధర్ కోరారు. ఈ మేరకు ఆయన కలికిరి ఎస్‌ఐ కె.రహీముల్లాకు ఫిర్యాదు చేశాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆ ముగ్గురు నేతలు టీడీపీ కార్యకర్తలను రెచ్చగొట్టి.. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు, పోలీసులు, ప్రజలపై దాడికి ఉసిగొలుపుతుండటం పరిపాటిగా మారిందన్నారు. రెచ్చగొట్టే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

కల్యాణమండపం ప్రారంభం



రొంపిచర్ల : రొంపిచర్ల క్రాస్ పెద్ద గొట్టిగల్లులో వీఎమ్ఆర్ కన్వెన్షన్ గ్రూప్స్ కల్యాణ మండపాన్ని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్ర రెడ్డి శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాధవ రెడ్డి, ఎంపీపీ పురుషోత్తం రెడ్డి, జెడ్పీటీసీ ఈశ్వర్ రెడ్డి, జెడ్పీ చైర్మన్ వాసు, ఏపీఎండీసీ చైర్‌పర్సన్ షమీమ్ అస్లాం, మదనపల్లి మునిసిపల్ వైస్‌చైర్మన్ జింకా చలపతి, కొండవీటి నాగభూషణం, పాల ఏకరి సంఘం ప్రెసిడెంట్ మురళీధర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

తల్లీకూతుళ్లపై బంధువుల దాడి

మదనపల్లె : తల్లీకూతుళ్లపై బంధువులు దాడి చేసి గాయపరిచిన సంఘటన శనివారం మదనపల్లెలో జరిగింది. పట్టణంలోని అనపగుట్టకు చెందిన ఎం.ఆదిలక్ష్మి(33) ప్రైవేట్ ఆస్పత్రిలో నర్సుగా పని చేస్తూ... తన తల్లి రత్నమ్మ, తండ్రి గంగాధర, చెల్లి సునీతతో కలిసి ఉంటోంది. ఆమె చిన్నాన్న రామచంద్ర కుటుంబంతో వీరికి కొంత కాలంగా స్థల వివాదం నడుస్తోంది. ఈ విషయమై టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసి పెద్ద మనుషుల సమక్షంలో ఒప్పందం కుదుర్చుకున్నారు. అయితే శనివారం సదరు స్థలంలో దారి వెంట నడవకూడదని చిన్నాన్న రామచంద్ర కుటుంబ సభ్యులతో కలిసి.. ఆదిలక్ష్మి, రత్నమ్మలను నిలువరిస్తూ గొడవకు దిగాడు. దీంతో వారు రామచంద్రను ప్రశ్నించడంతో ఆవేశానికి లోనైన ఆయన కుటుంబ సభ్యులతో కలిసి కర్రలతో వారిపై దాడి చేసి విచక్షణా రహితంగా కొట్టారు. దాడిలో తల్లి,కూతురు గాయపడగా, స్థానికులు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. టూటౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రాపూరు రోడ్డు ప్రమాదంలో మరో ఇద్దరు మృతి


మృతి చెందిన నాగమణి

చిట్వేలి : మండలంలోని రాపూరు ఘాట్ రోడ్డులో శుక్రవారం రాత్రి కొండను ఐచర్ వాహనం ఢీకొన్న సంఘటనలో మరో ఇద్దరు మహిళలు మృతి చెందారు. నెల్లూరు జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన 15 మంది రైల్వేకోడూరులోని పెళ్లిలో క్యాటరింగ్ చేయడానికి వెళ్తూ రోడ్డు ప్రమాదానికి గురైన విషయం తెలిసిందే. ఇందుకూరు మండలం గమలపాలెం గ్రామానికి చెందిన కత్తి నాగమణి (52), కనకమ్మ తీవ్రంగా గాయపడి, కడప రిమ్స్‌లో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందారు. శుక్రవారం ఇందుకూరు మండలం గమలపాలెం గ్రామానికి చెందిన పత్రా దివ్య (45), నెల్లూరులోని బీవీ నగర్‌కు చెందిన చల్లా సుజాత (47) మృతి చెందిన విషయం తెలిసిందే. దీంతో ఈ ప్రమాదంలో మొత్తం మృతుల సంఖ్య నాలుగుకు చేరింది. ఇప్పటి వరకు ముగ్గురి మృతదేహాలకు శవపరీక్షలు నిర్వహించి బంధువులకు అప్పగించినట్లు పోలీసులు తెలియజేశారు. ఈ సంఘటనలో మరో 11 మంది గాయపడి వివిధ ఆసుపత్రులలో చికిత్స పొందుతున్నారు. వారిలో నెల్లూరులోని బీవీ నగర్‌కు చెందిన క్యాటరింగ్ మాస్టర్ అమర్నాథరెడ్డి, నెల్లూరులోని వెంకటేశ్వరపురానికి చెందిన డ్రైవర్ భాస్కర్, బుచ్చి మండలం కనగలపాడుకు చెందిన పద్మావతి, కోవూరు టౌన్‌కు చెందిన పి.లక్ష్మి, వెలుగు సుప్రజ, సి.నిర్మల, మర్రిపాడుకు చెందిన కల్లూరు శేషమ్మ, పాటూరు సునీత, నల్లల మర్రిపాడుకు చెందిన పి.సునీత, సోమలకు చెందిన పి.నాగమణి, ఆలూరు మండలం చెర్లో సంఘానికి చెందిన కొమ్మగిరి కృష్ణవేణి ఉన్నారు.

విద్యార్థినికి వాతలు పడేలా టీచర్ దండన

- జ్వరంతో జిల్లా ఆస్పత్రికి తీసుకువచ్చిన తల్లిదండ్రులు
- విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు వెల్లడి


దివ్య వీపుపై కనిపిస్తున్న వాతలు

మదనపల్లె : తరగతి గదిలో అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేదని మూడో తరగతి విద్యార్థినిపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఓ మహిళా ఉపాధ్యాయురాలు.. వీపుపై వాతలు పడేలా చితకబాదింది. దీంతో విద్యార్థిని రెండు రోజులుగా తీవ్ర జ్వరంతో బాధపడుతూ శనివారం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్సల కోసం వచ్చింది. విద్యార్థిని తల్లిదండ్రుల కథనం... మదనపల్లె మండలం దండువారిపల్లెకు చెందిన నాగరాజు, లలిత దంపతుల కుమార్తె దివ్య(8) అదే గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో మూడో తరగతి చదువుతోంది. మూడు రోజుల క్రితం దివ్య పాఠశాలలో ఉండగా, తరగతి ఉపాధ్యాయురాలు శారద పాఠ్యాంశాలకు సంబంధించి కొన్ని ప్రశ్నలు వేసింది. దివ్య వాటికి సమాధానం చెప్పకపోవడంతో ఆగ్రహించిన ఉపాధ్యాయురాలు స్టీల్ స్కేల్‌తో దివ్య వీపు మీద వాతలు పడేలా చితకబాదింది. ఇంటికి వెళ్లిన ఆ విద్యార్థినికి మరుసటి రోజు ఉదయం జ్వరం రావడం, పాఠశాలకు వెళ్లేందుకు భయపడుతుండటంతో తల్లిదండ్రులు ఏమైందని అడిగితే జరిగిన విషయం చెప్పింది. దీనిపై తాము టీచర్‌ను నిలదీస్తే.. ఆమె సమాధానం చెప్పకుండా వెళ్లిపోయిందని తల్లిదండ్రులు తెలిపారు. జ్వరంతో బాధపడుతున్న దివ్యను మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువచ్చి చికిత్సలు చేయించారు. ఆ బాలిక వీపుపై పడిన వాతలను ఆస్పత్రి ప్రాంగణంలో మీడియాకు చూపించి తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. జరిగిన ఘటనపై విద్యాశాఖ అధికారులు, పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు వారు తెలిపారు.

బాధితురాలికి బంగారం అప్పగింత

జమ్మలమడుగు : పోగొట్టుకున్న రూ.3 లక్షల విలువైన బంగారాన్ని బాధితురాలికి అప్పగించిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. నంద్యాల జిల్లా కొలిమిగుండ్లకు చెందిన కృష్ణవేణి శనివారం జమ్మలమడుగుకు షాపింగ్ కోసం వచ్చింది. ఈ క్రమంలో మూడు లక్షల విలువ గల 5 తులాల బంగారం ఉన్న బ్యాగ్‌ను పోగొట్టుకుంది. వెంటనే స్థానిక అర్బన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో సీఐ సదాశివయ్య సిబ్బందిని రంగంలోకి దించారు. కానిస్టేబుల్ మధుసూధన్‌రెడ్డి, ఈశ్వరయ్య, రియాజ్‌లు బాధితురాలు తిరిగిన ప్రాంతాలను పరిశీలించారు. ఏ ప్రాంతాలలో తిరిగిందో సీసీ కెమెరాల ద్వారా తెలుసుకుని ఆమె బ్యాగ్‌ను గుర్తించారు. బ్యాగ్‌లో ఐదు తులాల బంగారం ఉంది. ఆ బ్యాగ్, బంగారాన్ని కృష్ణవేణికి అప్పగించారు. గంట వ్యవధిలోనే బ్యాగ్ గుర్తించడంతో జిల్లా ఎస్పీ అన్బురాజన్ జమ్మలమడుగు పోలీసులను అభినందించారు.

పరీక్షా ఫలితాలు విడుదల



ఏఎఫ్‌యూ : కడప నగరంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయంలో స్కూల్ ఆఫ్ ప్లానింగ్‌లోని ఆర్కిటెక్చర్ విభాగానికి సంబంధించిన 2, 4, 6వ సెమిస్టర్ పరీక్షా ఫలితాలను వీసీ ఆచార్య బి.అంజనేయప్రసాద్, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.సి. సురేంద్రనాథ్‌రెడ్డి శనివారం విడుదల చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ రిజిస్ట్రార్ రాజేష్‌కుమార్‌రెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డా. ఇ.సి. సుప్రియ, సహాయ అధికారులు ఉదయ్‌ప్రకాష్‌రెడ్డి, ప్రవల్లిక పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొన్న కారు – వ్యక్తి దుర్మరణం


మృతి చెందిన శేఖర్

సంబేపల్లె : మండలంలోని చిత్తూరు–కర్నూలు జాతీయ రహదారిపై శనివారం బైక్‌ను కారు ఢీకొనడంతో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. చిత్తూరు జిల్లా పూతలపట్టు మండలం తేనేపల్లె గ్రామం టి.రంగంపేటకు చెందిన కె.శేఖర్(62) ద్విచక్రవాహనంలో చిన్న, చిన్న వ్యాపారాలు చేసుకొంటూ జీవనం సాగిస్తుండే వాడు. ఈ క్రమంలో కర్నూలు నుంచి భాకరాపేటకు బయలుదేరాడు. మండల పరిధిలోని రోడ్డువారి కొత్తపల్లె సమీపంలో సద్దికాళ్ళ నారాయణ ఇళ్ల సమీపంలోకి రాగానే.. పీలేరు వైపు నుంచి వస్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో శేఖర్ అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటన స్థలాన్ని ఎస్‌ఐ షరీఫ్ పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.

బెటాలియన్ అధికారి భార్య దౌర్జన్యం

కడప అర్బన్ : కడప నగరం వైవీ స్ట్రీట్‌లోని వస్త్ర దుకాణంలో డబ్బులను ఇవ్వకుండా వారితో గొడవపడుతున్న బెటాలియన్ అధికారి భార్య అడ్డంగా దొరికిన వీడియో శనివారం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. సిద్దవటం మండలంలోని 11వ బెటాలియన్‌కు చెందిన ఓ అధికారి భార్య వస్త్ర దుకాణాల్లో కొన్ని నెలలుగా బట్టలు కొనుగోలు చేసి డబ్బులు ఇవ్వడం లేదు. ఓ కానిస్టేబుల్ సాయంతో ఆమె బెదిరింపులకు పాల్పడుతోందని దుకాణ యజమానులు కడప వన్‌టౌన్ పోలీసుల దృష్టికి తీసుకుని వెళ్లారు. ఈ సంఘటనపై కడప వన్‌టౌన్ పోలీసులు ఆమెకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఎవరి డబ్బులు వారికి ఆమె అందజేసి వెళ్లిపోయినట్లు సమాచారం.

లారీ, బైక్ ఢీకొని యువకుడి మృతి

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని పెన్నానది ఒడ్డున ఉన్న శ్రీ అయ్యప్పస్వామి దేవాలయం వద్ద శుక్రవారం అర్ధరాత్రి లారీ, బైక్ ఢీకొనడంతో గురుప్రసాద్ (17)మృతి చెందగా, దస్తగిరి అనే యువకుడికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పోట్లదుర్తి గ్రామానికి చెందిన గురుప్రసాద్, దస్తగిరి స్నేహితులు. వీరు శుక్రవారం రాత్రి బైక్‌పై ప్రొద్దుటూరు నుంచి స్వగ్రామమైన పోట్లదుర్తికి బయలుదేరారు. బైక్‌ను దస్తగిరి నడుపుతుండగా, వెనుక గురుప్రసాద్ కూర్చున్నాడు. మార్గంమధ్యలోని చెక్‌పోస్టు వద్ద రాగానే బైక్, ఎదురుగా వస్తున్న లారీ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో గురుప్రసాద్, దస్తగిరికి తీవ్ర గాయాలు అయ్యాయి. వీరిని ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో గురుప్రసాద్ మృతి చెందాడు. దస్తగిరిని మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు తరలించారు. మృతుడి తండ్రి గుర్రప్ప ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ట్రాక్టర్ ఢీకొని తల్లీకూతుళ్లకు గాయాలు

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక జమ్మలమడుగు బైపాస్ రోడ్డులో ట్రాక్టర్ ఢీకొన్న సంఘటనలో స్కూటీలో వెళ్తున్న తల్లీకూతుళ్లు గాయపడ్డారు. ట్రాఫిక్ పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. చౌటపల్లెకు చెందిన ఆర్.దేవి జిల్లా ఆస్పత్రి వెనుక భాగంలోని ఒక ప్రైవేట్ పాఠశాలలో టీచర్‌గా పని చేస్తున్నారు. ఆమె కుమార్తె శరణ్య కూడా అదే పాఠశాలలో 7వ తరగతి చదువుతోంది. ఈ క్రమంలో శనివారం పాఠశాల వదిలిన తర్వాత ఆమె కుమార్తెతో కలిసి స్కూటీలో చౌటపల్లెకు బయలుదేరారు. జమ్మలమడుగు బైపాస్ రోడ్డులోని ముక్తియార్ ఆయిల్ మిల్లు వద్దకు వెళ్లగానే.. పక్క వీధిలో నుంచి ట్రాక్టర్ వచ్చి ఢీకొంది. ఈ సంఘటనలో దేవితోపాటు కుమార్తె శరణ్యకు గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం ప్రొద్దుటూరులోని ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

విద్యతోపాటు ఉద్యోగం సాధించేలా శిక్షణ

వైవీయూ : డిగ్రీ విద్య అయిపోయిన వెంటనే ఉద్యోగం, ఉపాధి లభించేలా కోర్సులను తీర్చిదిద్దినట్లు ఏపీ కళాశాల విద్య కమిషనర్ డాక్టర్ పోలా భాస్కర్ పేర్కొన్నారు. శనివారం కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాల (స్వయంప్రతిపత్తి)లో మెగా జాబ్‌మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ విద్యార్థి డిగ్రీ విద్య అయిపోగానే జీవితంలో స్థిరపడేలా నైపుణ్యాలను అందిపుచ్చుకునేలా కోర్సులను అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. విద్యార్థులు చదువుకుంటూనే ఇంటర్న్‌షిప్‌ల ద్వారా స్కిల్స్ పెంపొందించుకునేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. కళాశాల విద్య, ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాబ్‌మేళాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కడప ఆర్‌జేడీ డాక్టర్ బాబు, కర్నూలు, అనంతపురం జిల్లాల ఆర్‌జేడీ డాక్టర్ నాగలింగారెడ్డి మాట్లాడుతూ ఉన్నత విద్యలో వస్తున్న సంస్కరణలు విద్యార్థులకు మేలు చేస్తాయన్నారు. కడప ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.రవీంద్రనాథ్ మాట్లాడుతూ కళాశాలలో నిర్వహిస్తున్న ఈ జాబ్‌మేళాకు 2640 మంది విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని తెలిపారు. అనంతరం విద్యార్థులకు రాతపరీక్ష, ఇంటర్వ్యూ, గ్రూప్ డిస్కషన్ తదితర విధానాల్లో ఎంపిక ప్రక్రియ నిర్వహించారు. కాగా ఈ మేళాలో దాదాపు 40 కంపెనీలకు చెందిన ప్రతినిధులు ఇంటర్వ్యూ ప్రక్రియ నిర్వహించారు. కార్యక్రమంలో ఓఎస్‌డీ అనిల్‌కుమార్, అకడమిక్ ఆఫీసర్ సుధాకర్, నంద్యాల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శశికళ, ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వి. సలీంబాషా, అధ్యాపకులు పాల్గొన్నారు.